రేపు పలు గ్రామాలలో విద్యుత్ అంతరాయం

విశాలాంధ్ర - సబ్బవరం: మండలంలోని సబ్బవరం డి-2 సెక్షన్ పరిధిలోని 33/11కేవీ అంతకపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని అడిషనల్ బ్రేకర్ స్కీమ్ పనులు కారణంగా ఈనెల 25వ తేదీ బుధవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని కసింకౌంటెన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అంతకపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గుల్లేపల్లి, మల్లునాయుడు పాలెం, మొగలిపురం, బోధువలస, అయ్యన్నపాలెం , మర్రిపాలెం, అంతకపల్లి, వంగలి, రాయపురాగ్రహారం, టెక్కలిపాలెం, నాయనమ్మపాలెం, ఆరిపాక, గొట్టివాడ, పెదయతపాలెం, బంగారమ్మపాలెం, అడ్డురు, ఎల్లువి, నాయనమ్మపాలెం, లగిసెట్టిపాలెం, గాలిభీమావరం, చినయాతపాలెం, కిల్లివానిపాలెం గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. కావున ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు అందరూ సహకరించవలసిందిగా కోరారు.



విశాలాంధ్ర అనకాపల్లి
మంగళవారం 24, జూన్ 2025

అరజెన్ ఫార్మాలో ప్రమాదం

- ఇద్దరు కార్మికులకు గాయాలు

విశాలాంధ్ర - పరవాడ: పరవాడ రాంకీ ఎస్ఈజెడ్‌లోని అరజెన్ ఫార్మా కంపెనీలో సోమవారం తెల్లవారుజామున ప్రమాదం చోటుచేసుకుంది. కంపెనీలో లిక్విడ్ లైన్ నుంచి గ్యాస్ లీకై ఇద్దరు కార్మికులు గాయపడ్డారు. కెమిస్ట్, కాంట్రాక్ట్ కార్మికుడు జగదీష్, తులసి ఇద్దరు గాయపడ్డారు. వీరు ప్రస్తుతం గాజువాకలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు కార్మిక నేతలు తెలిపారు. ప్రమాదాన్ని కంపెనీ యాజమాన్యం గోప్యంగా ఉంచేందుకు ప్రయత్నించింది. అయితే సమాచారం అందుకున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్రావు, జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పరిశ్రమ వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా ఆ నేతలను ఎస్ఈజెడ్ గేట్ వద్ద సెక్యూరిటీ సిబ్బందితో యాజమాన్యం అడ్డగించింది. ఈ సందర్భంగా సీఐటీయు నేతలు రాంకీ యాజమాన్యంపై మండిపడ్డారు. జరిగిన ఘటన విషయాలను బయటకు తెలియకుండా పరిశ్రమ యాజమాన్యం, రాంకీ యాజమాన్యం కుమ్మక్కై విషయాన్ని గోప్యంగా ఉంచే ప్రయత్నం చేస్తున్నారన్నారు. గాయపడ్డ కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, జరిగిన సంఘటనపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, భద్రత ఆడిట్ నిర్వహించకపోవడం, ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే ఇట్లాంటి ఘటనలు పునరావతమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్పీడ్ అఫ్ డూయింగ్ బిజినెస్ వలన కార్మిక శాఖ అధికారులకు పరిశ్రమల తనిఖీ అధికారులకు అధికారాలను తీసివేసారని దీనివల్ల యాజమాన్యాలు ఇష్టానుసారంగా బాధ్యతను గాలికి వదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఇద్దరు కార్మికులు కోలుకునే వరకు పూర్తిస్థాయి వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.

సాగునీటి కాలువలో చెత్త తొలగింపు

విశాలాంధ్ర - యస్.రాయవరం : మండలంలోని గోకులపాడు గ్రామంలో జాతీయ రహదారి ఆనుకొని చెత్తతో నిండిన సాగునీటి కాలువ అనే కథనంపై పంచాయతీ అధికారులు స్పందించారు. సోమవారం విశాలాంధ్ర దినపత్రికలో వచ్చిన కథనంపై అధికారులు ఆదేశాలతో ఆ కాలువలో చెత్తాచెదారంను తొలగించే పనులను పారిశుద్ధ్య కార్మికుల ప్రారంభించారు. అధికారులు స్పందించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విశాలాంధ్ర ఎఫెక్ట్

సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించాలి: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర - అనకాపల్లి: జిల్లావ్యాప్తంగా ఉన్న ఎస్సీ ,ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.బాబ్జి, జి.ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా ఒకే ఒక్క బీసీ మహిళా కళాశాల వసతిగృహం ఉండడం వల్ల అది అందరికీ సరిపోకపోవడం వలన చాలామంది మహిళా విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారు. కావున మరొక ఎస్టీ, ఎస్సీ, బీసీ మహిళా వసతి గృహాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కళాశాల వసతిగృహాల్లో విద్యార్థుల మెస్ బిల్లుల నుంచి అక్కడ పనిచేసే కుక్, కమాటి వాచ్మెన్ లాంటి వర్కర్స్‌కు జీతాలు ఇవ్వడం జరుగుతుందని, దీనివలన విద్యార్థులకు ఇచ్చే మెనూలో కోతలు విధించాల్సి వస్తుందని, ఇలా చేయడం వల్ల విద్యార్థులకు పౌష్టికారమైన ఆహారం అందడం లేదన్నారు. కాబట్టి ప్రభుత్వమే గిరిజన సంక్షేమ కళాశాల వసతి గృహాలలో పని చేసే వర్కర్స్ కి ప్రభుత్వమే జీతాలు చెల్లించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చాలాచోట్ల సరైనటువంటి ప్రహరీ లేక, త్రాగునీటి సౌకర్యం లేక, విద్యార్థులు నానా వ్యవస్థలు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నాయుడు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 30 ఫిర్యాదులు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో సోమవారం మొత్తం 30 ఫిర్యాదులు స్వీకరించబడ్డాయి. అందులో ఆస్తి వివాదాలు, కుటుంబ సంబంధిత కలహాలు, మోసపూరిత సంఘటనలు మొదలైన అంశాలు ప్రధానంగా ఉన్నాయి. అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు స్వయంగా కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి ప్రత్యక్షంగా ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఒక్క ఫిర్యాదుని సానుకూలంగా విని, సంబంధిత అధికారులకు తక్షణమే విచారణ చేసి, చట్టపరమైన తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదును న్యాయబద్ధంగా పరిశీలించి, బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు పోలీసు శాఖ కట్టుబడి ఉంది. ప్రజల్లో పోలీసులపై విశ్వాసాన్ని పెంపొందించేందుకు నిరంతరంగా పని చేస్తాం అని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్సై డి.వెంకన్న పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ పాఠశాలలో భారీగా విద్యార్థులు చేరిక

విశాలాంధ్ర - కే.కోటపాడు: ఈ సంవత్సరం కొత్తగా ప్రవేశపెట్టిన మోడల్ పాఠశాలల్లో విద్యార్థులు భారీగా చేరుతున్నారు. ఈ మండలం పిండ్రంగి మోడల్ ప్రాథమిక పాఠశాలలో ఒకేసారి 62 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారని మండల విద్యాశాఖ అధికారులు కే సత్యనారాయణ డివిడి ప్రసాద్ తెలిపారు. మోడల్ పాఠశాలలో విద్యా విధానం ప్రత్యేక పద్ధతిలో ఉంటుందని, విద్యార్థులు సులువుగా బోధను పొందేటట్లు ఉంటుందన్నారు. గ్రామస్తులు సహకారంతో అత్యధికంగా ప్రవేశాలు జరుగుతున్నాయి అన్నారు. ఇంతకు ముందు పాఠశాలను, పాఠశాల ప్రాంగణాన్ని అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామలక్ష్మి ఎంపీటీసీ సభ్యుడు ఎన్.గోపి పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు బి.శ్రీరామ్మూర్తి, ఉపాధ్యాయులు బంగారునాయుడు నాయుడు, నాయుడు బాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యనమల రామకృష్ణను కలిసిన శాప్ డైరెక్టర్

విశాలాంధ్ర - సబ్బవరం: మాజీ ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణని స్పోర్ట్స్ అథారిటీ ఆంధ్ర ప్రదేశ్ (శాప్) డైరెక్టర్‌గా నూతనంగా ఎన్నికైన పిబివిఎస్ఎన్ రాజు (బుచ్చిరాజు) తునిలో ఆయన స్వగృహం నందు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామకృష్ణకు పుష్పగుచ్చం ఇచ్చి దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఆయన వెంట గవర కార్పొరేషన్ డైరెక్టర్ వేగి పరమేశ్వరరావు, సబ్బవరం టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కోరాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి టీచర్లకు తల్లికి వందనం అమలు చేయాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట: అర్హులైన అంగన్వాడి టీచర్లకు తల్లికి వందనం పథకం అమలు చేయాలని అంగన్వాడి టీచర్లు మండల పరిషత్ సూపరిండెంట్ సిహెచ్.ఆర్.కే. వర్మకు వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వం అంగన్వాడీ టీచర్లకు పథకం అమలు చేసిందని, కూటమి ప్రభుత్వం కూడా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వి.పద్మ, తులసి, వెంకటలక్ష్మి, అమ్మాజీ, శ్యామల కుమారి, శాంతి, వరలక్ష్మి, గౌరీదేవి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సంతోష్ కుమార్‌కు ఘన సత్కారం

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల ప్రభుత్వ ఆసుపత్రిలో గత రెండున్నర ఏళ్లుగా స్పెషలిస్ట్ జనరల్ మెడిసిన్ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కే.సంతోష్ కుమార్ చింతపల్లికి బదిలీపై వెళ్లిపోవడంతో సోమవారం ఉదయం ఆయనను పలువురు ఘనంగా సత్కరించారు. టీడీపీ పట్టణ అధ్యక్షులు వద్దాది రంజిత్ వర్మ, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ పుప్పాల రమేష్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ లెక్కల కాశిబాబు, సర్పంచ్ యడ్ల కళావతి, జిల్లా ఆర్య వైశ్య సంఘ ఉపాధ్యక్షులు శ్రీనాథు శ్రీనివాసరావు, మరువాడ ఈశ్వరరావు, శ్రీనాధు రాం బాబు, జల్లి సూర్యప్రకాష్, జాగాని కామేశ్వరరావు, బొడ్డేటి నాయుడుతో పాటు ఆసుపత్రి సూపరిండెంటెంట్ బి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో డాక్టర్ సంతోష్ కుమార్‌కు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.

ఘనంగా శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగులలో సోమవారం జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షులు, పార్టీ సిద్ధాంతకర్త శ్రీశ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా మాడుగుల బిజెపి పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పుట్టా గంగయ్య, లాయర్ శ్రీనాథు ప్రసాదరావు, శ్రీనాధు వెంకటరాజు, ట్రైలర్ నాయుడు, కొడా వెంకటేశ్వరరావు, సర్ని గంగాధరరావు, జీవీ.రమణ, టమ్మిశెట్టి ప్రసాద్, పాండురంగ, పట్నాల సోమేష్, శ్రీనాధు మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం: మండలంలోని అమృతపురం గ్రామంలో జనసంఘ్ వ్యవస్థాపకుడు డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి బలిదాన్ దివాస్ నియోజకవర్గం ఇన్‌చార్జి, 25వ బూత్ అధ్యక్షులు గౌటీవాడ సామ్రాట్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బలిదాన్ దివాస్ మండలం కన్వీనర్ రెడ్డి రామునాయుడు, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు భూపతి అప్పారావు, ఆకాష్ కుమార్, ప్రభు కుమార్, గండి సత్యం నాయుడు పాల్గొన్నారు.

మునగపాక: మండలంలోని తోటాడ గ్రామంలో బిజెపి మండల అధ్యక్షుడు మళ్ల కాళేశ్వరరావు ఆధ్వర్యంలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ 72వ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా వైస్ ప్రెసిడెంట్ పోలమర శెట్టి నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ శ్యాం ప్రసాద్ ముఖర్జీ అతి చిన్న వయసులో కలకత్తా విశ్వవిద్యాలయానికి కులపతిగా నియమించబడిన ఘనత పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బొడ్డేడ భాస్కరరావు, మండల నాయకులు పోలమరశెట్టి నాగభూషణం, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైసీపీ ఆధ్వర్యంలో యువత పోరు

విశాలాంధ్ర - చోడవరం: వైఎస్సార్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద యవత పోరు నిరసన నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలంగా... ఉద్యోగం, ఉపాధి, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతను మోసం చేసిన వైనాన్ని ప్రజలకు తెలియచెప్పేలా, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అనకాపల్లి రింగ్ రోడ్‌లో గల వైసీపీ జిల్లా కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీగా వెళ్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యువ నాయకుడు వెంకటేష్ మాట్లాడుతూ యువత చేయి చేయి కలపి, హక్కుల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నిద్దామన్నారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం యువతకు నిరుద్యోగ భృతి, ఫీజు రియంబర్స్మెంట్, వసతి దీవెన, తల్లికి వందనం వంటి పథకాలు అమలు చేస్తామంటూ కాలయాపన చేస్తూ యువతను మోసం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడు నియోజకవర్గాలలో గల నిరుద్యోగ యువత, వైసిపి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు సిల్వర్ బేసిన్లు పంపిణీ

విశాలాంధ్ర-మునగపాక: పాడి రైతుల అభివృద్ధి ధ్యేయంగా విశాఖ డెయిరీ పనిచేస్తుందని గ్రామ సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, పాల ఉత్పత్తిదారుల సంఘ అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్రావు పేర్కొన్నారు. మండలంలో అరబుపాలెం గ్రామంలో సోమవారం పాడి రైతులకు సిల్వర్ బేసిన్లు పంపిణీ చేశారు. సంఘ సభ్యులైన 180 మందికి పశువుల దాణాకు ఉపయోగపడే సిల్వర్ బేసిన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి బి.కృష్ణ, సొసైటీ డైరెక్టర్లు, పాల రైతులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - అనకాపల్లి: అనకాపల్లి జిల్లాకు పశ్చిమ ట్రెజరీ కార్యాలయానికి సబ్ ట్రెజరీ ఆఫీసర్‌గా నూతనంగా నియామకమైన వి.వి.జోగారావును రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకఇంగా శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా దీర్ఘకాలికంగా కొన్ని సమస్యలను ఎస్‌టీ ఓ దృష్టికి పెన్షనర్స్ తీసుకువెళ్లారు. ప్రతినెల ఆరోగ్య భీమా చెల్లించే కొంతమంది పెన్షనర్ల భార్యాభర్తల ఇద్దరు పేరునా వసూలు చేస్తున్నారని తక్షణం భార్య పేరుతో ఉన్న బీమాను తొలగించవలసిందిగా ఎస్టిఓను కోరారు. అదే విధంగా భార్యాభర్తలు, ఉద్యోగస్తులు అయన సందర్భంలో ఒకరు పెన్షన్ తీసుకున్నవారు మరొక ఉద్యోగం చేస్తున్నవారు కనుక ఇద్దరు దగ్గర ఆరోగ్య భీమా వసూలు చేస్తున్నారని ఒక్కరికి మాత్రమే వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, అలాగే భార్య ఉద్యోగం చేస్తున్న పే స్లిప్‌లో పుట్టిన తేదీ లేకపోవడం సమస్యలు వస్తున్నాయని, పెన్షనర్లకు పేస్లిప్‌లో డేట్ అఫ్ బర్త్ లేకపోవడం వల్ల క్వాంటం పెన్షన్ పొందేటప్పుడు కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎస్ టి ఓ కి సభ్యులు వివరించారు. ఏ చిన్న సమస్య ఉన్న నా దృష్టికి తీసుకువస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల సత్యనారాయణ, ఎస్. మన్మధరావు, జోగారావు, యల్లపు శ్రీరాములు, కే.చంటిబాబు,, కే.సర్వేశ్వరరావు, గణపతి, శరగడం నూకరాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాటిపూడి నీటిని జిందాల్‌కి ఇవ్వొద్దు

జిబి అప్పారావు తాటిపూడి ఆయకట్టు పరిరక్షణ కమిటీ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: జిందాల్ పరిశ్రమకు తాటిపూడి నీరును ఇవ్వవద్దని కోరుతూ సోమవారం జిబి అప్పారావు తాటిపూడి ఆయకట్టు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు, మాజీ జెడ్పీటీసీ పెద్దబాబు అన్నారు. తాటిపూడి జలాశయ ఆయకట్టు ప్రాంతంలో కొన్ని వేల ఎకరాల పొలానికి సాగునీరు వెళుతుందని రెండో పంటకు రావలసిన నీరును జిందాల్ పరిశ్రమకు తరలించడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. దీనివల్ల ఎంతో మది రైతులు అనేక ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందన్నారు . తాటిపూడి జలాశయం నీరు 2023లో జీవో నెంబర్ 14 తో అప్పటి ప్రభుత్వం జిందాల్ భూములలో పెట్టే చిన్న పరిశ్రమలు ఎంఎస్ఓ పార్క్‌కి ఇస్తామన్న జీవోను ప్రభుత్వం రద్దు చేసుకోవాలన్నారు. ప్రాజెక్టు నిర్వహణ, కాలువల, నీకు పంపిణీ చూసే తగిన సిబ్బందిని నియమించాలన్నారు. ఖరీఫ్ పంటకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. రైతు ఈ కార్యక్రమంలో గంట్యాడ మండలం వైసిపి నాయకులు కోడెల శ్రీనివాసరావు, ఇతర గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం వార్షికోత్సవంలో ఎమ్మెల్యే కోళ్ల

విశాలాంధ్ర - వేపాడ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా రాజధాని అమరావతిలో వెలగపూడి సచివాలయం వెనుక భాగంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక సుపరిపాలనలో తొలి అడుగు పేరిట నిర్వహించిన సమావేశానికి శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన ఆర్థిక,పాలనా విధ్వంసాలను సరి చేస్తూ రాష్ట్రాన్ని పునర్నిర్మాణం దిశగా తీసుకెళ్తూ,స్వల్పకాలిక అభివృద్ధి లక్ష్యాలతో పాటు వికసిత ఆంధ్రప్రదేశ్ సాధన కోసం స్వర్ణాంధ్ర 2047 విజన్ లాంటి దీర్ఘ కాలిక ప్రణాళికలను కూడా కూటమి ప్రభుత్వం రూపొందించి అమలు చేస్తుందని తెలిపారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి ఏడాది పూర్తయిన సందర్భంగా ఏడాదిలో రాష్ట్ర అభివృద్ధికి చేసిన కృషిని తెలియజేయడం జరిగిందన్నారు.

వచ్చే నాలుగేళ్లలో లక్ష్యాలను ఎలా సాధించాలని అంశంపై చర్చించడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ ఇందుకూరి సుధారాణి, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్ల రామకృష్ణ, గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి లక్ష్మి పాల్గొన్నారు.

ఎట్టకేలకు గొల్లగరువు వద్ద గోతులు పూడ్చివేత

- రావాడ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి చొరవతో తాత్కాలిక పరిష్కారం

విశాలాంధ్ర - పరవాడ: రావాడ పంచాయతీలోని బొట్టవానిపాలెం-రేఖవానిపాలెం రహదారిలో గొల్లగరువు వద్ద ఏర్పడిన భారీ గోతులకు సర్పంచ్ మోటూరు సన్యాసి నాయుడు, పంచాయతీ కార్యదర్శి అనురాధ చొరవతో సోమవారం తాత్కాలిక పరిష్కారం లభించింది. రావాడ పంచాయతీ పరిధి బొట్టవానిపాలెం-రేఖవానిపాలెం మార్గం గుండా రహదారి శిథిలావస్థకు చేరుకుని ప్రయాణీకులు, వాహనదారులకు, పాదాచారులకు చుక్కలు చూపిస్తోంది. కొన్నేళ్ళుగా ఈ రోడ్డు దెబ్బతిని పెద్దపెద్ద గోతులు ఏర్పడిన పట్టించుకునేవారే లేరని పరిసర గ్రామాల ప్రజలు వాపోయారు. గొల్లగరువు సమీపంలో చిన్నపాటి వర్షం కురిసినా రహదారి చెరువును తలపిస్తుంది. వాహనదారులు, ప్రయాణీకులు వెళ్ళేందుకు నానాతంటాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవలే ఈ రహదారి సమస్యపై పలు దినపత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. గొల్లగరువు వద్ద రహదారిపై వర్షపు నీరు చేరి రహదారి చెరువు మాదిరిగా తలపించడాన్ని స్థానిక సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, పంచాయతీ కార్యదర్శి అనురాధ పరిశీలించారు. పరిసర గ్రామాల ప్రజలు, ప్రయాణీకులు, వాహనదారులు ఇబ్బందులు పడకుండా గొల్లగరువు వద్ద రహదారిపై వర్షపు నీరు నిల్వ లేకుండా సోమవారం ఆప్రాంతంలో గ్రావెల్, దానిపై క్రసర్ డ్రస్ట్ పోసి జెసిబి సహాయంతో తాత్కాలిక మరమ్మత్తులు చేపాట్టారు. దీంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఈ రోడ్డుకు నిధులు కేటాయించి పూర్తి స్థాయి మరమ్మతులు చేయించాలని ప్రజానీకం, వాహనదారులు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ: 9 మందికి గాయాలు



విశాలాంధ్ర - కశింకోట: మండలంలోని బయ్యవరం జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్న సంఘటనలో పెద్ద ప్రమాదం తప్పింది. నర్సీపట్నం డిపోకు చెందిన అల్ట్రా డీలక్స్ ఆర్టీసీ బస్సు విశాఖపట్నం వెళుతూ దారిలో బయ్యవరం వద్ద ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ సంఘటనలో బస్సు ముందు భాగం నుజ్జయింది. ప్రమాదం జరిగే సమయానికి బస్సులో 34 మంది ప్రయాణికులు ఉన్నారు. లారీని ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొనడంతో ప్రయాణికులు ఒకరిపై ఒకరు చల్లాచెదురుగా పడ్డారు. ఈ సంఘటనలో బస్సు డ్రైవర్ తోపాటు 8మందికి గాయాలయ్యాయి. వీరిలో బస్సు డ్రైవర్ తీవ్రంగా గాయపడగా, మిగిలిన ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యానికి తరలించారు. బస్సు రోడ్డు మధ్యలో ఉండి పోవడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ప్రయాణికులంతా స్వల్ప గాయాలతో బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సంఘటనా స్థలాన్ని అనకాపల్లి డి.ఎస్.పి శ్రావణి, సీఐ అల్లు స్వామి నాయుడు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

విశాలాంధ్ర - అచ్యుతాపురం: ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రభుత్వ భూములు కాపాడాలంటూ తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. పూడిమడక రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములను నియోజకవర్గ స్థాయి నాయకుడు అక్రమంగా కొనుగోలు చేసి మరలా అమ్మడానికి చూస్తున్నాడని ఆరోపించారు. అనేకసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని తక్షణమే ఆ భూములను స్వాధీనం చేసుకొని ప్రజలకు ఉపయోగపడేలా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు వాసుపల్లి అప్పారావు ధోని కాసుబాబు తదితరులు ఉన్నారు.